క్లుప్తంగా

ఉపాధి పనుల లక్ష్యాన్ని పూర్తి చేయాలి



ఉపాధి సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌ను పూర్తి చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్లాన్ బీ పనులు, హౌసింగ్, ఎస్సీ, ఎస్టీ లేబర్ మొబలైజేషన్ చేయాలన్నారు. ఉద్యానవన పనులకు సంబంధించి సంపూర్ణ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పాతరోడ్డు వంతెనపై కూలిన రక్షణ గోడ

కోటవురట్ల : పాతరోడ్డు వంతెనపై ప్రమాదం పొంచి చూస్తోంది. ఈ వంతెనపై ఓ పక్క రక్షణ గోడ కూలిపోయింది. వాహనదారులు, పాదచారులు ఏమాత్రం ఆదమరిచినా సుమారు 30 అడుగుల లోతులో ఉన్న సర్పానదిలో పడి మృత్యువాత పడడం ఖాయం. ఈ వంతెన మీదుగా చౌడువాడ, గొట్టివాడ గ్రామాల ప్రజలతో పాటు మాకవరపాలెం మండల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. రైతులు పొలాలకు వెళ్లాలన్నా ఈ వంతెనే ఆదారం. చీకట్లో వాహనదారుల, పాదచారులు అజాగ్రత్తగా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : గుండెపోటుకు గురై మృతి చెందిన మునగపాక నివాసి, పూర్వపు విద్యార్థి ఆడారి తాతినాయుడు కుటుంబాన్ని ఆదుకునేందుకు సంబంధిత బ్యాచ్ విద్యార్థులు బుధవారం సాయం అందించేందుకు ముందుకొచ్చారు. 1994–95 బ్యాచ్‌కు చెందిన తాతినాయుడు ఇటీవల మృతిచెందడంతో అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వపు విద్యార్థులు విరాళాలు పోగు చేసి బుధవారం అతని కుటుంబ సభ్యులకు రూ.55 వేల మేర ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రంతో పాటు మరో రూ.10వేల విలువ చేసే కిరాణా సామాగ్రిని అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో బొడ్డేడ వెంకటలక్ష్మి, ఆడారి పద్మ, పెంటకోట పట్టాభి, కర్రి భాస్కరరావు, మళ్ల వరదేశినాయుడు, ఆడారి కిరణ్, గోపీనాథ్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



మూలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.మండలంలోని మూలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎం నరసింగరావు, పెద్దలు భీశెట్టి నాగేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు



అచ్యుతాపురం కూడలిలో డ్రగ్స్ నిర్మూలించాలని అవగాహన కల్పిస్తూ మానవహారం



మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

మత్తు వదలకపోతే చిత్తే..



మునగపాకలో విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

పాయకరావుపేట : యువకులు, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, వాటి రవాణాకు దూరంగా వుండాలని సీఐ పి.అప్పలరాజు, ఎస్ఈబి సిఐ ఎస్.ధర్మారావులు ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు దుర్వినియోగం, అక్రమ రవాణా ధినం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పంచాయితీ రాజ్ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకూ చేపట్టారు. అనంతరం చిత్రమందిర్ థియేటర్ సెంటర్ వద్ద మానవ హారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శుభాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.దేవన్న, ఎస్ఈబీ ఎస్ఐ పి.జాన్, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, శ్రీ ప్రకాష్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మునగపాక : మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా బుధవారం మునగపాకలో ఎస్ఐ ప్రసాదరావు నేతృత్వంలో విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తద్వారా కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో అంతర్జాతీయ డ్రగ్ వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ర్యాలీ,జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. మాదవ ద్రవ్యాల నిర్మూలనకు అందరూ సహకరించాలని సీఐ బుచ్చిరాజు కోరారు.

మత్తు బారిన పడితే ఎన్నో అనర్థాలు

యలమంచిలి రూరల్ : డ్రగ్స్,మత్తు పదార్థాలను వాడకూడదని, వాటికి బానిసలైతే యువత ఉజ్వల భవిష్యత్ బుగ్గిపాలవుతుందని న్యాయమూర్తులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్), శాంతి భద్రతల పోలీసు అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యసనం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం యలమంచిలి పట్టణం ఆర్టీసీ కాంప్లెక్సు కూడలి వద్ద విద్యార్థులతో వారంతా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బ్యానర్లు పట్టుకుని మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు, మత్తుకు బానిసలు కావద్దంటూ నినాదాలు చేస్తూ స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల బాధితుల పట్ల వివక్ష కాకుండా వాటి నుంచి ఎలా బయటపడాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అందర్నీ కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత పెడదోవ పడుతోందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మాదక ద్రవ్యాలు,మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో కలిసి అధికారులంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యలమంచిలి సివిల్ జడ్జి స్వాతి భవాని,సెబ్ సిఐ పి ఉమామహేశ్వరరావు,యలమంచిలి పోలీసు సర్కిల్ సిఐ షేక్ హపూర్,పట్టణ ఎస్సై పాపినాయుడు,ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పన్న అన్నారు. మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని అడ్డురోడ్డులో స్థానిక శ్రీ ప్రజ్ఞాకళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అప్పన్న మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల అనారోగ్యం బారిన పడడమే కాకుండా వ్యసన పరులుగా మారుతున్నారన్నారు. అలాగే మండల కేంద్రంలో పోలీస్ సిబ్బంది, సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో కూడా ఇప్పుడు మత్తు పదార్థాల వినియోగం పెరిగినట్టు సమాచారం ఉందని, వాటిని పూర్తి స్థాయిలో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు, పీహెచ్‌సీ సిబ్బంది ఎం.రత్నం, జి.కొండబాబు, ప్రసాద్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మత్తుకు లోనైతే జీవితం ఛిద్రం

నక్కపల్లి : మత్తు పదార్థాలకు బానిసయితే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని, విద్యార్థి దశ నుంచి మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నక్కపల్లి సీఐ విజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మొదట సరదాగా అనిపించినప్పటికీ క్రమేణా మత్తు పదార్థాలకు బానిసను చేస్తాయన్నారు. యువత మత్తుపదార్థాల బారిన పడితే కలిగే అనర్థాలను తెలియజేసి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అడ్డురోడ్డు ర్యాలీలో పాల్గొన్న సీఐ అప్పన్న



ఎస్.రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్, పీహెచ్‌సీ సిబ్బంది



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రాజకీయాలకతీతంగా పట్టణాభివృద్ధి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు
- ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణస్వీకారం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: ఎన్నికల వరకే రాజకీయాలుండాలని, తర్వాత ప్రజలందరికీ ప్రజాప్రతినిధులంతా జవాబుదారీగా ఉండాలని నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రజాప్రతినిధులంతా ప్రజలకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తే పట్టణాభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేకు అధికారులు, వార్డు కౌన్సిలర్లు ఘన స్వాగతం పలికారు. తర్వాత ఆయనతో ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ప్రమాణం చేయించారు. పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యేగా చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. అనంతరం అధికారులతో పలు అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్రావు, పలు విభాగాల అధికారులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్

మునగపాక : రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని వాడ్రాపల్లిలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో బుధవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల వినియోగం అలాగే ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడ్రాపల్లిలో చౌడు భూములున్నట్లు గుర్తించామన్నారు. ఫౌండేషన్ ద్వారా ఉచితంగా భూసార పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

కోటవురట్ల : ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆశించిన ఫలసాయం రావాలని వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సీతారామరాజు ఆకాంక్షించారు. తంగేడు ఆర్బీకేలో బుధవారం విత్తనాల పంపిణీ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ సీతారామరాజు, ఉప సర్పంచ్ ఆర్‌ఎస్ లక్ష్మీ నరసింహరాజు చేతుల మీదుగా రైతులకు విత్తనాలు అందజేశారు. సీతారామరాజు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ రైతులకు పెద్ద పీట వేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం తపించేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్, రైతులు పాల్గొన్నార్రు.

30న రక్తదాన శిబిరం

యలమంచిలి : ఈనెల 30 ఆదివారం ఉదయం యలమంచిలి పట్టణం కొత్తపేట వద్ద ఉన్న బుజ్జి కూరగాయల షాపు దగ్గర సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ మరియు బుజ్జి విజిటేబుల్స్ వారి ఆధ్వర్యంలో అఖిల హరిత సంకల్పం వారి ద్వారా రక్త దాన శిబిరం మరియు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గొలుసుపూడి శ్రీనివాస బుజ్జి బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించడం జరుగుతుందని, యలమంచిలి పట్టణంలో యువతీ యువకులు, ప్రజలు తరలి వచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని సంస్థ తరుపున బుజ్జి కోరారు.

అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తే కేసులు తప్పవు

రాంబిల్లి : అక్రమ మట్టి , ఇసుక తవ్వకాలు, తరలింపు చేస్తే కేసులు తప్పవని సీఐ ధీనబంధు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అక్రమ మట్టి , ఇసుక తవ్వకాలు, తరలింపు చేస్తే సంబంధిత వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. ఎక్కడైనా తవ్వకాలు, తరలింపు చేస్తే తమకు సమాచారం అందజేయాలని సీఐ కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

రాంబిల్లి : మండలంలో 9 గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో గల పంచదార్ల, భోగాపురం, ధారపాలెం, అప్పారాయుడుపాలెం, హరిపురం, వెంకటాపురం, గోకివాడ, మూలకొత్తూరు, మూలజంప గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ లైను పనుల కారణంగా ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని రాజశేఖర్ కోరారు.

రైతులకు విత్తనాల పంపిణీ

మాకవరపాలెం : మండలంలో తామరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ చెల్లారత్నం, టీడీపీ నాయకులు శ్రీను, జనసేన నాయకులు సురేష్ రైతులకు విత్తనాలు అందజేశారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పాయకరావుపేట : పట్టణంలో గల బృందావనం నందు గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం నిర్మాణం 26 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవ కార్యక్రమాల్లో కాకడ హారతి, పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు, కలశాలతో స్వామిని తిరువీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

మునగపాక : ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు నేతృత్వంలో పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు నిర్వహించారు. తిమ్మరాజుపేట,గణపర్తి, మునగపాక మెయిన్,వాడ్రాపల్లి, తోటాడ హైస్కూళ్లకు వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వై.రాము, బి.శంకరరావు, గౌరవ అధ్యక్షుడు వి.రామ్మోహనరావు, ఉపాధ్యాయులు తాతునాయుడు, అప్పారావు, జగదీష్, వీవీఎస్ సత్యనారాయణ, జిల్లా పూర్వ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : దార్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి 11 గంటల వరకు ఈ విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. ఈ మేరకు దార్లపూడి చినగుమ్ములూరు. చెల్లాపురం, యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామాల వినియోగదారులు సహకరించాలని సూచించారు.

పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిదీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో-2 వరహాలబాబు తదితరులు

నాతవరం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని నాతవరం ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రం ఎంఆర్సీ కార్యాలయం వద్ద బుధవారం మండల స్థాయిలో నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేసి బడి ఈడు పిల్లలుంటే వెంటనే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. స్థానికంగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్పీలు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తే ఆశయం నెరవేరుతుందన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, గోవిందు, సత్యవేణి, వెంకటలక్ష్మి, ఎంఆర్సీ సిబ్బంది నాయుడు, సాంబ, శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణపర్తి హైస్కూల్లో విద్యార్థి కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



గణపర్తి హైస్కూల్‌లో విద్యార్థి కిట్లను అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలని గణపర్తి సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు కోరారు. మండలంలోని గణపర్తి హైస్కూల్లో బుధవారం విద్యార్థి కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. హైస్కూల్ పీఎంసీ చైర్మన్ శరగడం జగది ఆధ్వక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ నాగేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, జనసేన నాయకులు కాళ్ల చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న వస్తువులు సద్వినియోగం చేసుకుని విద్యలో మంచి ఫలితాలు సాధించాలని సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. గోకులపాడు గ్రామంలో బుధవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు నేడులో అనేక నిధులు ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించి ప్రభుత్వం వాటి రూపురేఖలు మార్చిందన్నారు. వాటికి తగ్గట్టుగా ఉపాధ్యాయులు బోధన చేసి నాణ్యమయిన విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శేషరావు, ఉపాధ్యాయులు ఆర్.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగంబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకునాయుడు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : ఎస్‌బీఐ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా రైతులకు బుధవారం విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అరబుపాలెం గ్రామాభివృద్ధితో పాటు రైతులకు మెరుగైన సేవలందిస్తున్న ఎస్‌బీఐ ఫౌండేషన్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధి శ్రీకాంత్, భారతి పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకాశం దట్టంగా మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో సుమారు గంట సేపు భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షం నీరు కాలువలను తలపిస్తూ ప్రవహించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. మరమ్మతు పనులు అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు. భారీ వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.